సాక్షి కాకినాడ

బుధవారం | 1 | అక్టోబర్ | 2025



అన్న ప్రసాద భవనానికి విరాళాలు

కొత్తపేట: వాడపల్లి క్షేత్రంలో అన్న ప్రసాద భవన నిర్మాణానికి గాదిరాజు అనిల్‌కుమార్‌శర్మ (రాజమహేంద్రవరం) రూ. 2,87,755, సోమిశెట్టి సీతారత్నం రూ.50,116 (సఖినేటిపల్లి) విరాళంగా అందజేశారు.



ప్రాణాలు తీసిన బాణసంచా

అయినవిల్లి మండలం విలస గ్రామంలోని ఓ ఇంట్లో బాణసంచా పేలి దంపతులు దుర్మరణం పాలయ్యారు. గత ఏడాది అమ్మగా మిగిలిన సరకు తీస్తుండగా ఈ పేలుడు సంభవించింది. IIలో..

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: ఖరీఫ్ పంటల సాగు అవసరాల నిమిత్తం కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 13,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

7న జెడ్పీ సమావేశం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సమావేశం అక్టోబర్ 7న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు తీసుకురావాలని సూచించారు.

చేనేత కార్మికులను విస్మరిస్తే చరిత్రను విస్మరించినట్టే..

కపిలేశ్వరపురం: భారతీయ నైపుణ్యం, సంప్రదాయాలకు ప్రతీకగా చేనేత వృత్తి విరాజిల్లిందని, అంతటి ప్రాశస్త్యం గల చేనేత కార్మికులను విస్మరిస్తే చరిత్రను విస్మరించినట్టే అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. తమ చేనేత సంఘానికి వివిధ పథకాల ద్వారా రావాల్సిన రాయితీ బకాయిలను వెంటనే చెల్లించాలంటూ అంగరలోని శ్రీగణపతి చేనేత పారిశ్రామికుల సంఘం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న చేనేత కార్మికులకు ఎమ్మెల్సీ తోట సంఘీభావం తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్‌తో కలిసి చేనేత కార్మికుల నిరసన శిబిరంలో పాల్గొన్నారు. శ్రీగణపతి చేనేత సహకార సంఘానికి ప్రభుత్వం నుంచి రూ.3.85 కోట్లు బకాయిలు రావాల్సి ఉందని, వాటిని వెంటనే విడుదల చేయకపోతే సంఘం నిర్వహణ అగమ్య గోచరమవుతుందంటూ నేత కార్మికులు ఆవేదనను వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేనేత కుటుంబానికి ఏటా రూ.24 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేసిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు నేతన్నకు ఏడాదికి రూ.25వేలు ఆర్థిక సాయాన్ని, రెండు వందల యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని అమలు చేయలేదని విమర్శించారు. వైస్ ఎంపీపీ గుబ్బాం భానుప్రసాద్, గుడిమెట్ల రాంబాబు, శలా సుబ్రహ్మణ్యం, మత్సా గణేశ్వరరావు, శలా వీర్రాజు, తేలు సత్యనారాయణ, బళ్లా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దండెత్తిన దళితులు

- ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ఆగ్రహం
- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యాన నిరసన
- జీఓ ఉపసంహరించాలని డిమాండ్
- లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక



ఇంద్రపాలెం అంబేడ్కర్ జంక్షన్‌కు ర్యాలీగా తరలివస్తున్న ఎస్సీ సెల్ నేతలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వైద్య విద్యను ప్రైవేటీకరిస్తున్న కూటమి సర్కార్‌పై దళితులు దండెత్తారు. పేద, మధ్య తరగతి, ఎస్సీ విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే చంద్రబాబు విధానాలకు వ్యతిరేకంగా కాకినాడలో సోమవారం నిరసన తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యాన ఈ ఆందోళన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ పెద్ద ఎత్తున తరలి వచ్చిన నేతలు, కార్యకర్తలు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా ఆధ్వర్యాన కదం తొక్కుతూ ఇంద్రపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లోని వివిధ మండలాల నుంచి నేతలు సామర్లకోట మీదుగా కాకినాడ చేరుకున్నారు. తుని, పిఠాపురం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ నియోజకవర్గాల నుంచి పిఠాపురం, కాకినాడ భానుగుడి సెంటర్ రోడ్డు మీదుగా కాకినాడ ఇంద్రపాలెం అంబేడ్కర్ సెంటర్‌కు ర్యాలీగా తరలివచ్చారు. కూటమి సర్కారు తీరును తీవ్ర స్వరంతో ఎండగట్టారు.

తక్షణమే నిలిపివేయాలి

వైద్య విద్యను సొంత వారికి పప్పుబెల్లాల మాదిరిగా ఇచ్చే ఉద్దేశంతోనే కూటమి సర్కారు ప్రైవేటీకరణ జపం చేస్తోందని నేతలు, కార్యకర్తలు మండిపడ్డారు. చంద్రబాబు సర్కార్ డౌన్ డౌన్, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను తక్షణం నిలిపివేయాలి, పేదలకు ప్రభుత్వ వైద్య విద్యను దూరం చేసే కుట్రలను తిప్పికొడతాం, ప్రైవేటీకరణ జీఓను ఉపసంహరించుకోవాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఎస్సీలు, పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న చంద్రబాబునాయుడికి మంచి బుద్ధి ప్రసాదించాలంటూ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులు, ప్రజలనుద్దేశించి నేతలు ప్రసంగించారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గాల అధ్యక్షులు లంకా కృపానందం, గుడాల వెంకటరత్నం, బూలా అబ్బులు, బంగారు కృష్ణ, బళ్ల సూరిబాబు, పెదపాటి రమేష్ కుమార్, పార్టీ ఉపాధ్యక్షుడు చిల్లి దేవరాజు, రాష్ట్ర కార్యదర్శులు శెట్టిబత్తుల సురేష్ కుమార్, రామప్రసాద్, అప్పలరాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల భీమారావు, ఎస్సీ సెల్ మండల, గ్రామ నేతలు, అనుబంధ విభాగా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపసంహరించేంత వరకూ ఉద్యమం

వైద్య విద్యను ప్రైవేటీకరించే జీఓను ఉపసంహరించుకునేంత వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తాం. పేద కుటుంబాలపై చంద్రబాబు ఎందుకంత కక్ష కట్టారో అర్థం కావడం లేదు. ఇప్పుడు 33 ఏళ్ల లీజు అంటున్న కూటమి పాలకులు కొన్ని రోజులు గడిచాక 99 ఏళ్ల లీజులంటారు. పేద, దళిత కుటుంబాల్లో పిల్లలకు వైద్య విద్య అందకూడదనే కుట్రతోనే ప్రభుత్వ రంగంలో నిర్మిస్తున్న వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నారు. మెడికల్ కాలేజీలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో మంజూరయ్యేవంటున్నారు. అలాంటప్పుడు చంద్రబాబు సీఎంగా పని చేసిన అన్ని సంవత్సరాల్లో ఒక్క వైద్య కళాశాలైనా తీసుకువచ్చారా?

– శెట్టిబత్తుల కుమార్‌రాజా, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

'బాబు' దివాళాకోరుతనానికి నిదర్శనం

వైద్య విద్యను పేదలకు, దళితులకు అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టడం దేశంలోనే ఒక చరిత్ర. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ రంగంలో ఐదు మెడికల్ కాలేజీలను తీసుకువచ్చి, వైద్య విద్యను పేదల దరి చేర్చారు. అటువంటి నాయకుడి వారసుడిగా జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఏకకాలంలో ఏకంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారు. సుదీర్ఘ కాలం సీఎంగా చేశానని గొప్పగా చెప్పుకునే చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో రాష్ట్రంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా తీసుకురాగలిగారా? అటువంటిది సొంత వారికి లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో దాదాపు 80 శాతం నిర్మాణం పూర్తయిన కాలేజీలను ప్రైవేటుపరం చేయాలనుకోవడం చంద్రబాబు దివాళాకోరుతనానికి నిదర్శనం. ప్రైవేటీకరణపై చినబాబు, పెదబాబు మనసు మార్చుకోవాలి. ప్రైవేటీకరణపై కూటమి వెనక్కు తగ్గేంత వరకూ ఉద్యమం మరింత ఉధృతంగా కొనసాగుతుంది.

– అంగూరి లక్ష్మీశివకుమారి, మాజీ ఎమ్మెల్సీ

చంద్రబాబు దళిత వ్యతిరేకి

జగన్ దళితుల పక్షపాతిగా నిలిచిపోతే.. చంద్రబాబు దళితుల వ్యతిరేకిగా ఉన్నారు. ఇంగ్లిషు విద్యను పేదలు, దళితులకు చంద్రబాబు దూరం చేయాలనుకుంటే.. వాటిని ఆ వర్గాలకు జగన్ మరింత దగ్గర చేశారు. వైద్య విద్యను పేదలకు దూరం చేయాలనే కుట్రలతోనే చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణకు సిద్ధమైంది.

– గుల్లా ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఎస్సీ సెల్ ప్రతినిధులు కుమార్ రాజా, లక్ష్మీశివకుమారి, ఏడుకొండలు తదితరులు

మహానైవేద్యం సమర్పయామి



గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో శ్రీ లలితా దేవికి, గర్భాలయంలో సూర్యదేవునికి, ఉమాదేవి అమ్మవార్లకు, లక్ష్మీ నారాయణులకు, గణపతికి, పరమేశ్వరునికి మంగళవారం ఏకకాలంలో అష్టోత్తర కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, మహన్యాస పారాయణ, 27 ద్రవ్యాలతో, 27 కలశాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారికి 108 రకాల పిండి వంటలతో మహాభోగ నివేదన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– పిఠాపురం

మహాగౌరీదేవ్యై నమః



దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని, గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో అమ్మవారిని పసుపు కొమ్ముల మాలలతో మంగళవారం మంగళప్రదంగా అలంకరించారు. సమస్త మంగళాలను ప్రసాదించే అమ్మవారు మహాగౌరీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– పిఠాపురం

కాజేసిన మొత్తం రూ.95 లక్షలు

- బాధితులు 66 గ్రూపుల సభ్యులు
- కూరాడ బీసీ అవినీతిని వెల్లడించిన ఏపీఎం



కరప: కూరాడలో వేళంగి ఎస్‌బీఐ బ్యాంకింగ్ కరస్పాండెంట్ (బీసీ) చిన్నం ప్రియభారతి మొత్తం రూ.95 లక్షల మేర మహిళాశక్తి సంఘాల సొమ్మును కాజేసినట్లు నిర్ధారణ అయ్యిందని వెలుగు ఏపీఎం ఎంఎస్‌బీ దేవి మంగళవారం రాత్రి తెలిపారు. ఈ వ్యవహారంలో మొత్తం 66 గ్రూపుల సభ్యులు బాధితులుగా ఉన్నారని చెప్పారు. కూరాడ గ్రామస్తులతో కలసి ఏపీఎం సోమవారం 39 గ్రూపులను తనిఖీ చేయగా బీసీ రూ.52 లక్షలు కాజేసిందని గుర్తించారు. మిగిలిన గ్రూపుల అకౌంట్లను మంగళవారం ఏపీఎం తనిఖీ చేశారు. కూరాడలో 106 మహిళాశక్తి సంఘాలున్నాయి. వీటిలో 40 గ్రూపుల వారు వేళంగిలోని యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ బ్రాంచిల్లో తాము తీసుకున్న రుణాల వాయిదా, పొదుపు సొమ్ము జమ చేశారు. అక్కడకు వెళ్లలేని మిగిలిన 66 గ్రూపుల వారు కూరాడలోని ఎస్‌బీఐ బీసీ పాయింట్‌లో సొమ్ము చెల్లించేవారు. ఈ బీసీ పాయింట్‌ను ఆ గ్రామానికి చెందిన చెందిన ప్రియభారతి నిర్వహిస్తోంది. యానిమేటర్‌గా ఉన్న తన తల్లి మంగ సహకారంతో మహిళాశక్తి సంఘాలు చెల్లించే పొదుపు, వాయిదాల సొమ్మును పథకం ప్రకారం ఆమె కాజేసింది. ఎన్ని రోజులైనా రుణం తీరకపోగా ఇంకా బాకీ ఉన్నట్లు బ్యాంకు అధికారులు మహిళాశక్తి సంఘాల సభ్యులకు చెప్పడంతో అసలు విషయం బయటపడింది. దీనిపై వారు గగ్గోలు పెట్టడంతో ఈ నెల 27న ‘మహిళాశక్తి సంఘాల సొమ్ము గోల్‌మాల్’, 30న ‘తవ్వేకొద్దీ వెలుగు చూస్తున్న అక్రమాలు’ శీర్షికలతో ‘సాక్షి’ కథనాలు ప్రచురించింది. ఈ మేరకు ఏపీఎం సోమ, మంగళవారాల్లో ఆ గ్రామంలోని అన్ని గ్రూపుల అకౌంట్లను తనిఖీ చేశారు. కాజేసిన సొమ్ముతో బీసీ తాళ్లరేవు మండలం చొల్లంగిపేటలో ఒక ఇల్లు, కాకినాడలో ఒక ఇంటి స్థలం కొనుగోలు చేసినట్టు కూరాడ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అకౌంట్లను తనిఖీ చేసి స్వాహా అయిన సొమ్ము లెక్క తేల్చామని, తప్పులేమైనా ఉంటే సవరించి, ఎంత మేర అక్రమాలు జరిగాయో తుదిగా నిర్ధారించి, అన్ని ఆధారాలతో కరప పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేస్తామని ఏపీఎం దేవి తెలిపారు.

మహా సంకల్పం.. పరిపూర్ణం

- మహాశక్తి యాగంలో వంద కోట్ల కుంకుమార్చనలు పూర్తి
- వేలాదిగా పాల్గొన్న మహిళలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



వంద కోట్ల కుంకుమార్చనలు పూర్తవడంతో ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వర స్వామికి హారతి ఇస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని కాకినాడ శ్రీపీఠంలో నిర్వహిస్తున్న మహాశక్తి యాగంలో భాగంగా వంద కోట్ల కుంకుమార్చనలు మంగళవారం పూర్తయ్యాయి. పీఠంలో సెప్టెంబర్ 22 నుంచి లలితా సహస్ర నామాలు పఠిస్తూ వేలాదిగా మహిళలు పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి ఆధ్వర్యాన కుంకుమార్చనలు నిర్వహించారు. వరుసగా మూడో సంవత్సరం వంద కోట్ల కుంకుమార్చనలు పూర్తి చేశామని, మూడేళ్లలో మూడు వందల కోట్ల కుంకుమార్చనలు చేశామని ఈ సందర్భంగా స్వామీజీ తెలిపారు. వెయ్యి కోట్ల కుంకుమార్చనలు లక్ష్యంగా శ్రీపీఠంలో మహాశక్తి యాగం కొనసాగిస్తున్నామని ప్రకటించారు. అష్టమి మంగళవారం రావడంతో దీనిని మంగళాష్టమి, జయ అష్టమి అని పిలుస్తామని చెప్పారు. అష్టమి తిథి నాడు అమ్మవారిని పూజిస్తే గొప్ప ఫలితం ఉంటుందని అన్నారు. శ్రీకృష్ణుడు అష్టమి తిథినాడు పుట్టడంతో కష్టాలు అనుభవించాడని, కానీ అమ్మవారు ఆయనకు కష్టాలను భరించే శక్తిని ఇచ్చారని చెప్పారు. అమ్మను అందరూ ఆరాధించాలని, ఈ క్రమంలో మనం ఒకరి కీడు కోరుకోకూడదని హితవు పలికారు. శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు బగళాముఖిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం దేవీ కవచం, బగళాముఖి హోమం నిర్వహించారు. వేలాదిగా తరలిచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అన్న ప్రసాదం అందించారు.

- తానూ తగ్గేది లేదంటున్న రజతం
- పరుగు పందెంలో దూసుకుపోతున్న బంగారం, వెండి ధరలు
- సామాన్య, మధ్య తరగతి ప్రజల్లో ఆందోళన
- గతంలో కొనుగోలు చేసిన వారిలో నిండుకున్న జోష్
- నెల రోజుల్లో 10 గ్రాములకు రూ.20 వేలు పెరుగుదల

వడివడిగా పసిడి పరుగు



రాయవరం: ఏవండీ దసరా పండుగకు నెక్లెస్ కొంటారా..అంటూ గారాలు పోతున్న భార్యల వైపు భర్తలు బేల చూపులు చూడాల్సిన పరిస్థితి ఉంది. ఎందుకంటే బంగారం ధర చూస్తే బేర్‌మనే పరిస్థితి నెలకొంది. ఇప్పుడు 10 గ్రాముల బంగారం ధర రూ.1.20 లక్షల మార్కుకు చేరుకుంది. బంగారం ధరలు కళ్లెం లేని గుర్రంలా దౌడు తీస్తున్నాయి. కదం తొక్కుతున్న కాంచనానికి ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయలేక పోతున్నాయి. పుత్తడితో పాటుగా తానూ ఏమీ తక్కువ తినలేదన్నట్లుగా వెండి ధరలు కూడా విర్రవీగుతున్నాయి. స్వర్ణం వైపు చూడాలంటేనే సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం వివాహాల సీజన్ తిరిగి ప్రారంభం కావడంతో వివాహాలు నిర్వహించే సామాన్య, మధ్య తరగతి ప్రజలు బంగారం కొనాలంటేనే భయం భయంగా షాపుల వైపు అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది.





ఇంతింతై వటుడింతై అన్నట్లుగా...

పసిడి, వెండి ధరలు ఇంతింతై వటుడింతై అన్న చందంగా పెరుగుతున్నాయి. ఒకదానికొకటి పోటీ పడి మరీ పెరుగుతున్నాయి. జనవరి నెలలో 10 గ్రాముల బంగారం రూ.80వేలు వరకు పలకగా, జూలై నాటికి రూ.లక్షకు చేరుకుంది. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో రోజుకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు పెరుగుతూ ప్రస్తుతం 10 గ్రాముల బంగారం రూ.1.20 వేలకు చేరుకుంది. ఆగస్టు, సెప్టెంబరు నెలలో సుమారు 10 గ్రాములకు రూ.20 వేల వరకు పెరిగింది. ఇదిలా ఉంటే వెండి కూడా బంగారం బాటలోనే నడుస్తోంది. ఈ ఏడాది జనవరిలో కేజీ వెండి ధర రూ.92 వేలు పలుకగా, జూన్‌లో రూ.1.10 లక్షలు, జూలైలో రూ.1.11 లక్షలు, ఆగస్టులో రూ.1.11 లక్షలు ఉన్న కేజీ వెండి ధర నేడు రూ.1.50 లక్షలకు చేరింది. వెండిపై పెట్టుబడి పెట్టిన వారికి అదే తరహాలో లాభాలు వచ్చాయి. బంగారంతో పాటుగా వెండి ధర కూడా పరుగులు తీస్తూనే ఉంది. త్వరలోనే కేజీ రూ.2 లక్షలకు చేరుతుందన్న ఊహాగానాలున్నాయి.

మదుపరుల ముందుచూపే కారణమా?

పసిడి, వెండి ధరలు పెరుగుదలకు బులియన్ మార్కెట్ విశ్లేషకులు పలు రకాల కారణాలు పేర్కొంటున్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్, గాజా మధ్య జరుగుతున్న యుద్ధంతో పాటుగా ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాల ప్రభావంతో పసిడి ధర రోజు రోజుకు పరుగులు తీస్తోంది. దీనికితోడు బంగారంపై పెట్టుబడి సురక్షితంగా భావిస్తున్న మదుపరులు భారీగా కొనుగోలు చేస్తున్నారు. ఒక్క భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండడం బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణంగా వర్తకులు భావిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

కరోనా తర్వాత బంగారం వ్యాపారం బాగా తగ్గిపోయినట్లుగా వ్యాపారులు చెబుతున్నారు. అంతకు ముందు వారానికి ఆరు రోజులు వ్యాపారం సాగగా, ఇప్పుడు వారానికి నాలుగు రోజులు మాత్రమే వ్యాపారం సాగుతున్నట్లుగా వ్యాపారులు చెబుతున్నారు. పెద్ద షాపుల్లో రోజుకు 500 గ్రాముల వరకు అమ్మకాలు జరుగుతుండగా, చిన్న షాపుల్లో 20 గ్రాముల నుంచి 50 గ్రాముల వరకు అమ్మకాలు సాగుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చిన్నా, పెద్దా కలిపి 2,500 వరకు బంగారం విక్రయాల షాపులున్నాయి. ఉమ్మడి జిల్లాలో కరోనాకు ముందు రోజుకు 20 కేజీల చొప్పున బంగారం అమ్మకాలు జరగ్గా, ప్రస్తుతం 15 నుంచి 18 కేజీల వరకు అమ్మకాలు సాగుతున్నాయి. సీజన్ బట్టి ఈ అమ్మకాలు అటూఇటూగా ఉంటాయి. బంగారంతో పాటుగా వెండి అమ్మకాలు కూడా తగ్గాయి. ఆరు నెలల క్రితం వెండి కిలో రూ.50వేలు ఉండగా, ఆరు నెలల కాలంలో రూ.1.50 లక్షలకు చేరింది. చైనా, జపాన్ వంటి దేశాల్లో వెండిని ఎలక్ట్రానిక్స్, సాంకేతిక అవసరాలకు ఉపయోగించడం, ప్రపంచ వ్యాప్తంగా బంగారం, వెండిపై పెట్టుబడి పెట్టడంతో బంగారం, వెండి ధరలు ఊహించని పెరుగుదల కన్పించి ఆల్‌టైమ్ రికార్డుకు వాటి ధరలు చేరుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

లాభాలు కళ్ల చూస్తున్న బడాబాబులు

బంగారం ధర పెరగడంతో బడా బాబులు లాభాలు కళ్ల జూస్తున్నారు. ధర పెరుగుతుందన్న ముందుచూపుతో పలువురు మదుపరులు బంగారంపై పెట్టుబడులు పెట్టారు. వడ్డీ వ్యాపారం చేసే వారు కూడా బంగారంపై పెట్టుబడి పెట్టేందుకే మొగ్గు చూపారు. దీంతో 100 గ్రాముల వంతున బిస్కెట్లు కొన్నారు. మరికొందరు 50 నుంచి 70 కాసుల మధ్య వడ్డాణం వంటి వస్తువుల్ని తయారు చేయించుకున్నారు. ప్రస్తుతం ధర రూ.లక్ష దాటడంతో వీరందరిలో జోష్ నెలకొంది. పెట్టిన పెట్టుబడుల్లో 30 నుంచి 40 శాతం వరకు లాభాలను చూశారు.

వేచి చూస్తున్నారు



బంగారం కొనుగోలు చేయాలంటే కొనుగోలుదారులు ఆలోచించాల్సిన పరిస్థితి మార్కెట్‌లో ఉంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనుగోళ్లకు ముందుకు రావడం లేదు. ఒకప్పుడు శుభకార్యాలకు పెద్ద వస్తువులు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం చిన్న చిన్న వస్తువులతో సరిపెట్టుకుంటున్నారు. వెండిని కూడా ఆచి తూచి కొనుగోలు చేస్తున్నారు.

– అనిల్ జైన్, అధ్యక్షుడు, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా



నోట్ల పెళపెళ.. లక్ష్మీ కళకళ!

పిఠాపురం: మండలంలోని రాపర్తిలో వేంచేసియున్న దుర్గా మల్లేశ్వరి అమ్మవారిని రూ.15 లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు.



శ్రీ దుర్గాదేవిగా మాణిక్యాంబ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దసరా మహోత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం మాణిక్యాంబా అమ్మవారి మట్టి ప్రతిమకు శ్రీ దుర్గాదేవి అలంకరణ చేశారు.



సరస్వతీదేవి అలంకరణలో పద్మావతి అమ్మవారు



ఐశ్వర్యలక్ష్మీదేవి అలంకరణలో పద్మావతి అమ్మవారు

సరస్వతీదేవి, ఐశ్వర్యలక్ష్మిగా..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు గ్రామంలో కొలువైన శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పద్మావతి అమ్మవారు మంగళవారం సరస్వతీదేవి, ఐశ్వర్యలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ వేద పండితులు ఉదయం అమ్మవారిని పెన్నులతో సరస్వతీదేవిగా అలంకరించారు. మధ్యాహ్నం అమ్మవారిని రూ.10లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఈ అలంకరణకు రూ.200, రూ.100, రూ.50, రూ.10 నోట్లను ఉపయోగించారు.



రూ.50 లక్షల కరెన్సీతో..

ముమ్మిడివరం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని రూ.50లక్షల కరెన్సీ నోట్లతో లక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.



చినకొత్తలంకలో దుర్గాదేవిగా అమ్మవారు

దాడి కేసులో ఆరుగురి అరెస్టు

ఏలేశ్వరం: ఈనెల 18న పట్టణంలో జరిగిన దాడి కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై రామలింగేశ్వరరావు మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం పట్టణంలోని జనగన్నకాలనీలో నివాసం ఉంటున్న గుబ్బల వీరవెంకట సత్యనారాయణ సెల్ పాయింట్ నిర్వహిస్తున్నాడు. ఇతడిని ఫోన్‌లో బెదిరించి, షాపుపై దాడిచేసి గాయపరిచారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆరుగురిని అరెస్టు చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ కోసం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

408.825 కేజీల గంజాయి పట్టివేత

కోరుకొండ: గంజాయి అక్రమ రవాణాకు చెక్ పెట్టి నట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వై. శ్రీకాంత్ మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సై నాగార్జున ఆధ్వర్యంలో రూ.20,44,125 విలువైన 408.825 కేజీల గంజాయిని బూరుగుపూడి జంక్షన్‌లో పట్టుకున్నట్టు తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఆండి సెల్వం వేల్మురుగన్, నాగేంద్రన్‌లు కాకినాడ జిల్లా కత్తిపూడి నుంచి 10 బస్తాల్లో వ్యానులో తరలిస్తుండగా అరెస్టు చేసినట్టు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పరారీలో ఉన్న ప్రథమ నిందితుడు కుమార్, మరి కొందరికోసం గాలిస్తున్నట్టు తెలిపారు. ఎస్సైను, కానిస్టేబుళ్లు సత్తిరెడ్డి, ప్రసాద్, ప్రకాశరెడ్డి, సుబ్రహ్మణ్యం, పైడి నాయుడు, గోవిందులను డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్యకిశోర్ అభినందించారు.

ప్రాణాలు తీసిన బాణసంచా

- భార్యాభర్తల మృత్యువాత
- విలస గ్రామంలో విషాద ఛాయలు

అయినవిల్లి: దీపావళి పండగకు కిరాణా సామగ్రితో పాటు బాణసంచా అమ్ముకుని నాలుగు రూపాయలు వెనుక వేసుకుందామనే ఆశ ఆ భార్యాభర్తలను బలిగొంది. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కోనసీమ జిల్లాలోని అయినవిల్లి మండలం విలస గ్రామంలో బాణసంచా పేలి కంచర్ల శ్రీనివాసరావు (51). అతని భార్య సీతామహాలక్ష్మి(46) మృత్యువాత పడ్డారు. కిరాణా షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న ఆ దంపతులు గతేడాది దీపావళికి అమ్మగా మిగిలిన బాణసంచా సామగ్రిని ఇంటి అటక పై నుంచి తీసి శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఆ పేలుడు ధాటికి వారి ఇంటిపై శ్లాబు, ప్రహరీ కూలింది. పక్కనున్న ఇల్లు కూడా దెబ్బతింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భార్యాభర్తలు అక్కడికక్కడే మృత్యు ఒడికి చేరారు. వారి కుమారుడు ప్రదీప్ గాయపడ్డాడు. అతనిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అమలాపురం ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద స్థలిని ఎస్పీ రాహుల్ మీనా, డీఎస్పీ సుంకర మురళీకృష్ణ, సీఐ ఆర్. భీమరాజు, ఎస్ఐ హరికోటి శాస్త్రి పరిశీలించారు. శిథిలాల కింద చిక్కుకున్న భార్యాభర్తల మృతదేహాలను అంబులెన్స్‌లో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయినవిల్లి ఎస్సై హరికోటిశాస్త్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



శిథిలాల మధ్య ఉన్న కంచర్ల శ్రీనివాసరావు మృతదేహాన్ని బయటకు తీసి అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు, స్థానికులు



శిథిలాల మధ్యన ఉన్న కంచర్ల సీతామహాలక్ష్మి మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న పోలీసులు, స్థానికులు



ప్రమాద స్థలంలో గుమిగూడిన గ్రామస్తులు



పేలుడు శబ్దానికి కూలిన ఇంటి శ్లాబు, ప్రహరీ

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

మృతుల కుటుంబాలను ఆదుకోవాలని పి.గన్నవరం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

లైసెన్సు కలిగిన గోడౌన్స్‌లోనే బాణసంచా భద్రపరచాలి: ఎస్పీ

బాణసంచా సామగ్రి లైసెన్సు పొందిన గోడౌన్స్‌లోనే భద్రపరచాలని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా సూచించారు. లైసెన్సు లేకుండా బాణసంచా సామాగ్రి నిలువ ఉంచడం, తయారు చేయడం నేరమన్నారు. జాగ్రత్తలు కూడా తీసుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా ఇలా బాణసంచా నిలువ ఉంచితే ఇటువంటి ప్రమాదాలే ముంచుకొస్తాయని ఆయన హెచ్చరించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



నాగూర్ మీరా (ఫైల్)

పి.గన్నవరం: స్థానిక ఏటిగట్టు సెంటర్లో మంగళవారం సాయంత్రం లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు సమీపంలోని బట్టాయగూడెంనకు చెందిన షేక్ నాగూర్ మీరా (50) 15 ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చి డీఎస్ పాలెంలో నివసిస్తున్నాడు. మంగళవారం, శుక్రవారాల్లో అతడు షాపుల వద్ద సాంబ్రాణి పొగ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక ఏటిగట్టు సెంటర్లో షాపుల వద్ద సాంబ్రాణి పొగ వేసి, మూడు రోడ్ల సెంటర్‌కు సైకిలుపై వస్తుండగా అతడిని వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో అతడి తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లిపోవడంతో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద స్థానికులు అడ్డుకుని లారీని ఆపారు. మృతదేహం వద్ద అతడి భార్య జీబాషా బోరున విలపించింది. అందరితో కలివిడిగా ఉండే నాగూర్ మీరా ప్రమాదంలో మృతి చెందడంతో స్థానిక వ్యాపారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి..



తుని రూరల్: అన్నవరం రైల్వే రెండవ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్టు గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ తుని ఎస్సై పి.వాసు మంగళవారం తెలిపారు. ప్లాట్‌ఫాంపై బెంచీ కింద మరణించి ఉన్న వ్యక్తి శరీరంపై నలుపు రంగు టీ షర్టు, నీలం రంగు ట్రాక్ ఉన్నాయన్నారు. మృతుడికి కొంతదూరంలో కాఫీ రంగు బ్యాగ్ ఉందన్నారు. ఎవరైన గుర్తిస్తే జీఆర్‌పీకి 9490619020 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. హెచ్‌సీ మోహన్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహం తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో భద్రపర్చామన్నారు.

పాము కాటుకు మహిళ..

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలోని బురదకోట గిరిజన గ్రామ పంచాయతీలోని ధారపల్లిలో పాము కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. స్థానిక పోలీసుల కథనం మేరకు బురదకోట గిరిజన గ్రామ పంచాయతీలోని బాపన్నధారకు చెందిన బుట్టారి సన్యాసిరావు, లోవకుమారిలకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరు ధారపల్లిలో నివాసం ఉంటున్నారు. ఎప్పటి మాదిరిగానే సోమవారం రాత్రి బుట్టారి లోవకుమారి తన ఇంటిలోనే నేలపై నిద్రపోయింది. మంగళవారం తెల్లవారుజామున పాము కాటుకు గురైంది. ఆమెను బంధువులు ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు భర్త బుట్టారి సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలక్ష్యంతో అనర్థం

- బతుకుల్లో చీకటి నింపుతున్న అనధికార బాణసంచా కేంద్రాలు
- నిబంధనలు, జాగ్రత్తలు పాటించక గాలిలో కలసిపోతున్న ప్రాణాలు

అమలాపురం టౌన్: వెలుగులు నింపే దీపావళి పండగ ఏటా జిల్లాలో ఏదో ఒకచోట చీకట్లు నింపుతోంది. బాణసంచా లేదా మందు గుండు పేలి ప్రాణ నష్టం అనివార్యమవుతోంది. అనధికార బాణసంచా, మందుగుండు తయారీ కేంద్రాలు, నిల్వ ఉంచే ప్రదేశాల్లో నిబంధనలు పాటించకపోవడం, జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, తయారీదారుల నిర్లక్ష్యంతో కొన్ని నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అనధికార షాపులు, తయారీ కేంద్రాల వల్లే ఈ ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరుగుతోంది. అయినవిల్లి మండలం విలస గ్రామంలో ఓ ఇల్లు కం కిరాణా దుకాణంలో మంగళవారం సంభవించిన బాణసంచా పేలుళ్ల వల్ల భార్యాభర్తలు మృత్యువాత పడ్డారు. వారి కుమారుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గత ఏడాది దీపావళికి ముందు అమలాపురం పట్టణం రావులచెరువులో, మండపేట మండలం ఏడిద గ్రామంలో జరిగిన ఈ తరహా ప్రమాదాల వల్ల ఆ రెండు చోట్ల చెరో వ్యక్తి ప్రాణాలు విడిచారు.

మోనిటరింగ్ కమిటీల పర్యవేక్షణ శూన్యం

దీపావళి ముందు కేవలం అధికారికంగా లైసెన్స్ పొందిన షాపులు లేదా తయారీ కేంద్రాల్లో మాత్రమే బాణసంచా, మందుగుండు సామగ్రి నిల్వలు ఉండాలి. ఈ అనధికార నిల్వలపై పర్యవేక్షించేందుకు రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక కేంద్రం, విద్యుత్ తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటయ్యే మోనిటరింగ్ కమిటీల పర్యవేక్షణ సక్రమంగా జరిగితే ఇలాంటి ప్రమాదాలు జరగవు, ప్రాణనష్టం సంభవించదు.జిల్లాలో దాదాపు మూడు పదుల లోపే షాపుల్లో బాణసంచా తయారీకి అనుమతులు (లైసెన్సులు) ఉన్నాయి. అనధికారికంగా జిల్లాలోని ప్రతీ పట్టణంలో, కొన్ని గ్రామాల్లో అనేకం ఉన్నాయి. పెను ప్రమాదం సంభవించాక, ప్రాణ నష్టం జరిగాక ఇళ్ల మధ్య, జనవాసాల మధ్య అనధికార తయారీ కేంద్రాలు ఉండడం, నిల్వ ఉండచం తప్పని తీరిగ్గా చర్చించుకోవడం అలవాటైపోయింది. అది లోనే అధికార యంత్రాంగం కట్టడి చేస్తే ప్రమాదాలు నివారించవచ్చు.

మానటరింగ్ కమిటీల పర్యవేక్షణ లేకపోవడానికి తోడు నిబంధలను పాటించని, జాగ్రత్తలు తీసుకోని తయారీ దారుల నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయనవిల్లి ఘటనతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అధికార యంత్రాంగం ఒక్కసారిగా మేల్కొంది. తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్నారు. ఇదోదే ప్రమాదం జరగక ముందే స్పందించి ఉంటే ప్రాణ నష్టాలు జరగవు కదా..? అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

3 నుంచి క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి రెండో విడత అండర్–14, 17, 19 బాల బాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శులు శ్రీనివాస్, సుధారాణి మంగళవారం తెలిపారు. 3న టెన్నిస్‌కు డీఎస్ఏ మైదానంలోను, 4న కాకినాడ డీఎస్ఏ మైదానంలో స్క్వాష్, రెజ్లింగ్, మోడ్రన్ పెంటాథలాన్, తైక్వాండో, సైక్లింగ్–రోడ్, ట్రాక్, స్కేటింగ్ ఎంపికలు కాకినాడ రాజా ట్యాంక్ ఆవరణలోని వైఎస్సార్ స్కేటింగ్ రింక్‌లో జరుగుతాయన్నారు. నెట్‌బాల్ ఎంపికలు కోనసీమ జిల్లా ఎంజి ఎయిడెడ్ స్కూల్ ఆత్రేయపురంలోను, 6న డీఎస్ఏలో రగ్బీ, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, బీచ్ వాలీబాల్ ఎంపికలు కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్‌లో నిర్వహిస్తామన్నారు. 7న డీఎస్ఏలో హాకీ, బేస్‌బాల్, స్విమ్మింగ్, డైవింగ్ ఎంపికలు జరుగతాయన్నారు. ఆసక్తి గలవారు ఎంపికలు జరిగే తేదీలలో ఉదయం 8.30 గంటలకు వేదికల వద్దకు హాజరుకావాలని తెలిపారు.

గురువు మార్గదర్శకత్వం అవసరం

సహస్రావధాని గరికపాటి



గాడ్‌తో మాట్లాడుతున్న గరికపాటి

రాయవరం: సన్మార్గం వైపు అడుగులు వేసేందుకు ప్రతి ఒక్కరికీ గురు మార్గదర్శకత్వం అవసరమని, అప్పుడే దైవానుగ్రహానికి దగ్గరవుతామని సాగరఘోష కవి, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ఉద్బోధించారు. మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆధ్మాత్మిక ప్రసంగం చేస్తూ తల్లి, తండ్రి, గురువు తర్వాతే దైవం అన్నారు. తల్లిదండ్రులను, గురువును ఆరాధించడం భగవంతుడిని ప్రార్థించడం కంటే గొప్పదన్నారు. ఐశ్వర్యం, భోగభాగ్యాలు అశాశ్వతమని, గురువు చూపిన మార్గంలో పయనిస్తే దైవానుగ్రహానికి దగ్గరవుతారన్నారు. విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) చూపిన దారిలో భక్తులు నడవాలన్నారు. మరో సాహితీవేత్త మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ అమృతత్వాన్ని వివరించారు.

పీఠంలో ఆర్‌డీవోల పూజలు

కొత్తపేట, రామచంద్రపురం ఆర్‌డీవోలు శ్రీకర్, అఖిల దంపతులు మంగళవారం విజయదుర్గా పీఠాన్ని సందర్శించారు. అనంతరం పీఠంలో విజయదుర్గా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో పీఠాన్ని సందర్శించినట్లు తెలిపారు. విజయదుర్గా అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, అందరికీ మంచి జరగాలని అమ్మవారిని కోరుకున్నట్లు వారు తెలిపారు.

విరిసిన ధరలు!



కడియపులంక పువ్వుల మార్కెట్‌లో దసరా కొనుగోళ్లు

కడియం: మండలంలోని కడియపులంక అంతర్రాష్ట్ర పువ్వుల మార్కెట్‌లో దసరా సందడి నెలకొంది. అమ్మవారి ఆలయాల అలంకరణలో పువ్వుల అలంకరణకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ నేపథ్యంలో పువ్వుల ధరలు గతం కంటే మెరుగ్గా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా దసరా అలంకరణలో వినియోగించే బంతి, చామంతి తదితర రకాల ధరలు పెరిగాయని వివరించారు. స్థానికంగా పువ్వుల దిగుబడులు స్వల్పంగానే ఉన్నాయంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచే ఎక్కువగా పువ్వులు దిగుమతి అయ్యాయని వ్యాపారులు తెలిపారు. మంగళవారం కడియపులంక పువ్వుల మార్కెట్‌లో కేజీ చామంతులు రూ.150 నుంచి రూ.200 ధర పలికాయి. లిల్లీలు రూ.400, మల్లెపువ్వులు రూ.1,500, జాజులు రూ.1,000, కాగడాలు రూ.1,100, బంతి రూ. 100 నుంచి రూ.130, కనకాంబరం బారు రూ.270–రూ.300 ధర పలికాయి.

ఇండస్ట్రియల్ ఆయిల్‌ను డీజిల్‌గా విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఎఫ్‌సీఐ కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని రెండు నెలలుగా ఇండస్ట్రియల్ ఆయిల్‌ను తీసుకువచ్చి డీజిల్‌గా చెబుతూ అధిక రేటుకు విక్రయిస్తూ మోసానికి పాల్పడుతున్న నలుగురిని సర్పవరం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ పెద్దిరాజు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.. వచ్చిన సమాచారం మేరకు ఎఫ్‌సీఐ కాలనీలో ఆ ఇంటిపై దాడి చేసిన పోలీసులు మూడు ట్యాంకర్లను గుర్తించారు. ఒక ట్యాంకర్ లారీలో ఉన్న ఇండస్ట్రియల్ ఆయిల్‌ను మిగతా రెండు ట్యాంకర్ లారీలలోకి మోటారు సహాయంతో నింపుతుండగా వాటిని పట్టుకున్నారు. రమణయ్యపేటకు చెందిన అయినంపూడి సురేష్, నిడదవోలుకు చెందిన మునిశెట్టి జయప్రకాష్, అయినాల వెంకటేష్, గాజువాకకు చెందిన కొడవలి దుర్గారావును అరెస్ట్ చేసి, మూడు ట్యాంకర్లతో పాటు 20వేల లీటర్ల ఇండస్ట్రియల్ ఆయిల్, తోడేందుకు వినియోగిస్తున్న మోటారును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ పెద్దిరాజు తెలిపారు.

డీఎస్సీలో విజయం సాధించిన హాకీ క్రీడాకారులు



పీఈటీలుగా ఉద్యోగాలు సాధించిన డీఎస్ఏ హాకీ క్రీడాకారులతో కోచ్ రవిరాజు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): డీఎస్సీ–2025లో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో హాకీ కోర్టులో కోచ్ రవిరాజు వద్ద తర్ఫీదు పొందుతున్న నలుగురు క్రీడాకారిణులు పీఈటీలుగా ఉద్యోగాలు సాధించారు. జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన జి.వరలక్ష్మి, డీఎస్ సింధు దేవి, ఎస్.పరంజ్యోతి, కె.భారతి ఉద్యోగాలు సాధించిన వారిలో ఉన్నారు. వీరు అనేకసార్లు రాష్ట్ర చాంపియన్‌షిప్ సాధించిన జట్టులో సభ్యులుగా ఉన్నారు. ఉద్యోగాలు సాధించిన క్రీడాకారిణులను, తర్ఫీదునిచ్చిన కోచ్ రవిరాజును డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ మంగళవారం డీఎస్ఏలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.